# తారుమారు

కథా నిలయం
శ్రీకాకుళం

ఇలా జరగటానికి వీల్లేదు.

"ఏమయిందేమిటి?"

"అదే నీవు కథలు, నవలలు వ్రాసి మహారచయిత్రివి కావడం నేనిలా వెర్రి మొహం వేసుకోవటం, నన్ను అందరూ ఫలాన సుమలత మొగుడని అంటున్నారే గాని రంగారావని పిలవటం లేదు."

సుమలత ఫక్కున నవ్వింది.

"అయ్యగారికి నామోషీగా ఉందన్నమాట."

"నామోషీ కాదోయ్. నిన్ను సుమలత అని గాక రంగారావు పెళ్ళాం అంటారనుకో, నీకెలా ఉంటుంది?"

"చాలా గర్వంగా ఉంటుంది."

"నిజం? నీవు డబుల్ యం.ఏ. అని నీవు కాలేజి లెక్చరరువని, నీకూ ఒక వ్యక్తిత్వం ఉందని అనిపించదా?"

"అదంతా సెకండరీ. మొదట నేను రంగారావు భార్యను ఆ తర్వాత మిగిలిన వన్నీను."

"నిజమైన పతివ్రతవు సుమలతా. కానీ నా వ్యక్తిత్వం వెనుకబడి కేవలం భర్తగానే మిగిలిపోయానంటే నాకు చాలా బాధగా ఉంటుంది."

"యూ సిల్లీ... ఎందుకో చెప్పనా, మీ అహంభావం దెబ్బతింటుంది."

"ఏదో ఒకటిలే. బాధ మిగులుతుందా లేదా? దీనికో మార్గం చూచి పెట్టు లతా."

"ఏం చెయ్యమంటారు?"

"అడపా దడపా నా పేరిట కూడా కథలు పంపిస్తూ ఉండు."

"అదేం. మీరే వ్రాయవచ్చుగా."

"నీకున్న గర్వమిదే, నీకు తెలుసు నేను వ్రాయలేనని, ఒట్టి సైన్సు ముఖాన్ని అని. అందుకే నీకున్న గొప్ప వరాన్ని చూసి తెగ మురిసిపోతుంటావు. భార్య అంటే భర్తకు ఎన్ని విధాల తోడు నీడగా ఉండాలి! నిన్నేం అడిగాను? ధనమడిగానా

ధాన్యమడిగానా? నీ జీతం డబ్బులు మొత్తం రూపాయి పైసలతో సహా అప్పజెప్ప మన్నానా? యముని దగ్గర నుంచి నా ప్రాణం తీసుకొని రమ్మన్నానా? నా వెంట కారడవులలో తిప్పానా? లేక...''

''మీ ప్రియురాలింటికి స్వయంగా తీసుకెళ్ళి దింపి రమ్మన్నారా? నడివీధిలో నిలబెట్టి అమ్మజూపారా? నిండు సభలో...'' రంగారావు సుమలత నోటికి మధురంగా తాళం వేశాడు.

''నోటికి ఎంత వస్తే అంతా మాట్లాడటమేనా?'' అన్నాడు చివరకు.

''ఏం చెయ్యమంటా రింతకూ. నా కథలన్నీ మీ పేర పంపమంటారు అంతేనా?'' చెదిరిన అతని జుట్టు సవరిస్తూ అడిగింది.

''అన్నీ కాదు లతా, ఒకటి నీ పేరుతో ఇంకొకటి నా పేరుతో పంపుతూ ఉండు. ఏం? ఖ్యాతి వచ్చినా అపఖ్యాతి వచ్చినా ఇద్దరం చెరిసగం పంచుకొందాం.''

''ఆలోచిస్తాను'' అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది సుమలత.

నాలుగు రోజుల తర్వాత కథ చిత్తు కాపీ తెచ్చి ప్రాణనాథుని ఎదుట పెట్టింది. మరుసటి రోజు క్లాసుకు తయారవుతున్న రంగారావు ''ఏమిటిదీ'' అన్నాడు.

''కథ కావాలన్నారుగా మీ పేరుతో పంపుకోండి.''

''ఇలాగే పంపమంటావా?''

''బాగుంది. దీన్ని ఫెయిర్ కాపీ చెయ్యమనికూడా చెప్పాలా?''

రంగారావు ఎడమ చేత్తో ఆ కాగితాలు తిప్పిచూచాడు. ''అమ్మ బాబోయ్ పదహారు పేజీలే!''

''కుదురుగా వ్రాస్తే పన్నెండు పేజీలుంటుందంతే.''

''అయితే మాత్రం పన్నెండు పేజీలు కూర్చుని కాపీ చెయ్యడమంటే మాటలా? లతా! మంచిదానివి కాని నీకు కాస్త తీరిక దొరికినప్పుడు కాపీ చేసి పెట్టు.''

కాపీ చేసి, రంగారావు పేరుపెట్టి, అడ్రసు వ్రాసి, స్టాంపులు అంటించి ఇచ్చిన రోజు రంగారావు నవ్వుతూ ఆ కవరందుకొని భార్య బుగ్గపై చిటిక వేసి హుషారుగా పోస్టాఫీసుకు వెళ్ళాడు. సుమలతలో అంత ఉత్సాహం కనిపించలేదు.

ఆ రాత్రి అడిగాడు, ''ఎన్నాళ్ళలో వస్తుందంటావు మన కథ?''

''మన కథ? పెద్ద కష్టపడినట్లు మాట్లాడుతున్నారు!''

''పోనీలే, నీ కథే అనుకో, ఎప్పుడొస్తుందంటావు?''

"ఒక నెల పట్టవచ్చు."

"ఎందుకలా మొహం ముడుచుకొంటావు. ఒక కథ త్యాగం చేసినందుకే ఇంత చిటపటలాడాలా?"

"చిటపటలు కాదు కాని నా మనసు నిజంగానే బాగా లేదండీ. ఏమిటో నా కొడుకుని పరాయివాళ్ళకు అప్పజెప్పినట్లయింది."

"అబ్బో. అబ్బో ఈవిడకు మాతృ ప్రేమ పొంగిపోతోందే! అలాంటప్పుడు అబ్బాయి రాకను ఎందుకు వెనక్కి నెట్టినట్లు?'

"చూడండి ఒక దాని నుండి ఇంకో మాటకు ఎలా మార్చేస్తారో!" అని మొహం ఎర్రగా చేసుకుంది.

"పోనీలే ప్రస్తుతానికి ఈ కథారాజమే నీ కుమారరత్న మనుకొందాం. వీనిని దత్తతకు ఇచ్చితివిపో. ఇచ్చినను పరాయివాని పరము చేయలేదు కదా. నేను నీ ప్రాణసఖుడను, పతిదేవుడను కానా? నీ కుమారుడు నా కుమారుడు కాడా?"

సుమలత గలగల నవ్వింది.

* * *

కథ వెలువడిన రోజు రంగారావు సుమలతను ఒక్కసారిగా గాలిలోకి ఎత్తి దింపాడు. సినిమాకు తీసుకెళ్ళాడు. మల్లెపువ్వులు కొనిపెట్టాడు. ఖరీదయిన టెర్లిన్ చీర కానుక చేశాడు. రెస్టారెంటులో భోజనం ఏర్పాటు చేశాడు. చిన్నపిల్లవాడిలా సంబరపడిపోతున్న భర్తను చూసి సుమలత హృదయం ఉప్పొంగింది. ఈ మహా కథలు తన పేరుతో పడితేనేం... ఆయన పేరుతో పడితేనేం... వ్రాయాలనే తపన తనకుంది వ్రాస్తుంది. ఆయనకింత ఆనంద దాయకమయితే ఆయన పేరే అచ్చులో రానీ. ఇంత మాత్రంలో తనకు తరిగేదేముంది? తప్పితే రచయిత్రిగా తనకు పేరు రాదు. పోతేపోయింది ఎవరికి కావాలి ఆ పేరు? కథా రచయితలేం మహాకవులా, కవిసార్వభౌములా, కలకాలం సాహిత్య చరిత్రలో నిలిచిపోవటానికి? ఈనాడు చదివిన కథ రేపు గుర్తుండదు. ఇక దాని ప్రభావానికి లోనయ్యే వారెందరు? రచయితను గుర్తించే వారెందరు? పోనిద్దూ ఎందుకొచ్చిన వ్యామోహం.

ఈ వేదాంత చింతనతో సుమలత కేవలం రంగారావు భార్యగానే మిగిలిపోయింది లోకానికి- అదనంగా సుధాకరుని తల్లిగా మారింది.

* * *

"డామిట్, ఇలా జరగటానికి వీల్లేదు."

"ఏమయిందేమిటి?"

"అదే. నీవు కథలు, నవలలు వ్రాయటం నేను మహారచయితనయిపోవటం."

"మంచిదేగా మిమ్మల్ని రచయిత రంగారావు అంటున్నారే గాని సుమలత మొగుడనటం లేదుగా."

రంగారావు సుమలత కళ్ళలోకి చూశాడు.

"లతా నీకు అన్యాయం జరిగిపోతోంది. ఈ నాలుగేండ్లలలో నాకు నీవు తెచ్చిన పేరు ప్రఖ్యాతులు... అందరూ అడుగుతారు- ఇంతకు ముందు మీరు మీ భార్య పేరుతో వ్రాసేవారు కదండీ! అని. చూడు లతా ఈ ఉత్తరం చూడు! ఏదో సినిమాకు నవ్విన పువ్వులు నవలను ఎంచుకొంటున్నారట. రేపు ఎప్పుడో సన్మానం చేస్తామంటూ నా మిత్రులు గొడవ చేస్తున్నారు. ఇదేం అన్యాయం లతా. ఇప్పుడే అందరికీ చాటి వస్తాను, ఈ పేరు ప్రఖ్యాతులు నీవని. నేను కుదురుగా కూర్చుని పది వాక్యాలయినా వ్రాయలేనని."

సుమలత పక్కున నవ్వింది. చల్లటి నీళ్ళిచ్చి భర్తకు సేద తీర్చింది. "ఇప్పుడెలా జరుగుతోందో అలాగే జరగనివ్వండి. ఇంకేమీ గడబిడ చేయకండి. సాధారణంగా రచయిత్రుల వెనుక ఏదో పురుష హస్తం ఉంటేగాని రచనలు వెలువడవనే నమ్మకం చాలామందికి ఉంది. మీరు నిజం చెప్పినా నమ్మేవాళ్ళు తక్కువ కాబట్టి ఊరుకోండి."

"ఉహు. ఊరుకోను., రేపు ఏ సాహిత్య సంబంధమైన చర్చో పెట్టారంటే నీవేమైన వ్రాసిస్తే చదవగలనేమో గాని ధారాళంగా, స్వతహాగా మాట్లాడగలనా?"

"చర్చలో మీకా భయమేమీ అక్కరలేదు. సమావేశమయిన ప్రముఖులందరూ తమతమ భావాలను వెలిబుచ్చటానికే తహతహలాడుతుంటారు. మీరు చేయవలసిందల్లా వారికి కాస్త అవకాశం ఇవ్వటమే."

"నవ్వులాట కాదు లతా. నా మనసు కుతకుతలాడిపోతోంది. నీకు చాలా అన్యాయం చేశాను. ఈ కీర్తి భారాన్ని మోయలేను. ఆ శక్తి గలదానివి నీవే. ఎలాగో నన్నీ గందరగోళం నుంచి బయట పడెయ్యి."

సుమలత పకపకా నవ్వుతోంది.

"నీకు నవ్వుగానే ఉంటుంది నా పరిస్థితి. నీకు అర్థం కావటం లేదు. కరణేషు మంత్రిని కాస్త దయదలచరాదూ."

"సరే ఆ తర్వాత వచ్చే పరిణామాలు తట్టుకోగలరా? అప్పుడు అందరూ నవ్వుతున్నారంటూ బెంగపెట్టుకుంటారా?"

"అదేం లేదు నా మానాన నేను కెమిస్ట్రీ పాఠాలు బోధించుకొంటూ ఉంటాను. లోకం గొడవ అసలు పట్టించుకోను."

"సుమలత మొగుడని పిలిచినా..."

"ఓ యస్. పిలుచుకోనీ. నా కేం నా భార్య రచయిత్రిరా అని రొమ్ము విరుచుకొని సమాధాన మిస్తాను."

"మీతో సన్మానం గురించి మాట్లాడిందెవరు?"

"సుబ్బారావు... సాహితీ సభ కార్యదర్శి."

"సుగుణ భర్తేనా?"

"వాని భార్య పేరు సుగుణా? ఆమే, మీ కాలేజీలో ట్యూటరుగా పనిచేస్తోంది..."

"సరే, సరే. అన్నీ నాకు వదిలెయ్యండి... మీరు నిశ్చింతగా రెస్ట్ తీసుకోండి" అని అభయమిచ్చింది ఆ అర్ధాంగి.

* * *

మరునాడు సుబ్బారావు వచ్చి "సారీ, సన్మానసభను వాయిదా వేసుకోవలసి వచ్చింది" అన్నాడు. ఆ వారంకాక పై వారంలో లోకల్ పేపర్లో శ్రీమతి సుమలతా రంగారావుగారి 'తారుమారు' అనే కథ వెలువడింది. ఆ తర్వాత రచయిత రంగారావు మరుగున పడిపోయాడు.